

# చిత్రోన్మాదము

## పినిశెట్టి శ్రీరామమూర్తి

సుబ్బారావు మద్రాసువెళ్లి సినిమాలో చేరడానికి ఒక సంవత్సరంపాటు కష్టపడ్డా మొత్తంమీద ఒక ప్రొడక్షన్ మేనేజరును పట్టుకొని పది డైలాగున్న వేషం ఒక పిక్చర్లో వేశాడు. అది విడుదల కాబోతూండనగా, తన గ్రామం చేరుకున్నాడు.

అప్పటికే, 'సుబ్బారావు సినిమాల్లో వేషాలు వేస్తున్నాట్ట' అనే ప్రచారం సాగడంవల్ల, ఒక హీరో అదృష్ట వశాత్తూ తమ ఊరొచ్చినంతగా సంబరపడి అందరూ సుబ్బారావును చుట్టుముట్టారు. సినిమాలు ఎలా తీస్తారో, స్టుడియోలు ఎలాగుంటాయో తెలీనివాళ్లు అనేక ప్రశ్నలు వేశారు. ప్రతి ప్రశ్నకు పెద్ద అనుభవజ్ఞుడిలా సమాధానం చెప్పడంచూసి అంతా ఆశ్చర్యపోయారు. అంతేకాదు, తెలుగు చిత్రపరిశ్రమలో ఉన్న ప్రతి నటీనటులు తనకు తెలుసనీ, ఒకోసారి వాళ్లే తను ఉండే రూంకి వస్తూవుంటారనికూడా చెప్పాడు. ఇంకేం ఉన్న నాలుగురోజులూ సుబ్బారావుకి వూళ్లోవాళ్లంతా బ్రహ్మరథం పట్టారు.

సుబ్బారావు సినిమాలో నటించి వచ్చినందుకుగాను చిన్న సన్మానసభ ఏర్పాటుచేశారు. సుబ్బారావు అనర్గళంగా తన సన్మానానికి కృతజ్ఞత చెబుతూ మాట్లాడుతుంటే, అంతా విస్తుపోయారు. సుబ్బారావు తండ్రి పుల్లయ్యకు మాత్రం కొడుకు గురించి దిగులుపట్టుకుంది. వాడికి పెళ్లికాలేదు. సంపాదనలేకుండా మదరాసులో కూర్చుని తినడంవల్ల ఉన్న ఎకరంభూమీ అమ్మేశాడు. భవిష్యత్తు ఏమౌతుందో అని ఆందోళన పట్టుకుంది. గతంలో "నీకు సినిమా వొద్దు. ఇంటికొచ్చెయ్" అని తండ్రి ఉత్తరం రాస్తే "తెరమీద నా మొగం పడేవరకూ తిరిగిరాను" అంటూ ప్రతిజ్ఞాపూర్వకంగా ఉత్తరం రాశాడు. తన కోరిక నెరవేరిన తర్వాతే ఇంటికి వచ్చాడు సుబ్బారావు. వచ్చీరాగానే "తెరమీద మొగంపడిందా ?" తండ్రి ప్రశ్న. "చూస్తావుగా సినిమా రిలీజవుతుంది" అంటూ సగర్వంగా సమాధానం చెప్పాడు.

ఆరోజు సుబ్బారావు నటించిన చిత్రం విడుదలయ్యే రోజు. ఆ పల్లెటూరినుంచి సినిమా ఆడే హాలు బస్తీలో వుంది. పదిమైళ్ల దూరం. సుబ్బారావు స్నేహితులతోపాటు అతని తల్లిదండ్రులుకూడా బయలుదేరి బస్తీ వచ్చారు. సినిమాచూసే ముందే హాలుదగ్గర పెద్ద అలజడి ప్రారంభమైంది. అదేమీకాదు_అప్పటికే సుబ్బారావు ఈ సినిమాలో నటించినట్టు తెలిసి అంతా అతని చుట్టూ మూగి వింతజంతువుని చూస్తున్నట్టు చూస్తున్నారు. వాళ్ళందర్నీ తప్పించుకొని హాల్లోపడేటప్పటికి సుబ్బారావుకి బ్రహ్మప్రళయమైంది.

సినిమా బాగానే వుంది. సుబ్బారావు వేషం ఇంకా వస్తుంది ఇంకా వస్తుందని అంతా ఎదురుచూశారు. 'శుభం' పలికినా ఆ సినిమాలో సుబ్బారావుమొగం ఎక్కడా కనిపించలేదు. పిక్చరైన తర్వాత సుబ్బారావుకోసం చూస్తే అతనూ కనిపించలేదు.

మద్రాసు తిరిగివచ్చిన సుబ్బారావు ఏడుపుమొగంతో, ''పిక్చర్లో నా వేషం ఏమైంది'' అని ప్రొడక్షన్ మేనేజర్ను అడిగాడు. "లెంక్తు ఎక్కువైందని నువ్వుండే సీను కట్ చేశారు" అని నిర్లక్ష్యంగా సమాధానంచెప్పి వెళ్లిపోయాడు.